క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజాపూర్: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీదేవి గురువారం తెలిపారు. సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని, సమావేశానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల సమన్వయంతో గురువారం కళాశాలలో పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ భావాలను స్ఫూర్తి కలిగించడానికి వివేకానందుని బోధనలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఇలాంటి వ్యాసరచన పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారత్ వికాస్ పరిషత్ పాలమూరు అధ్యక్షుడు రమేష్‌చందర్ మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వామి వివేకానందని జయంతి సందర్భంగా శుక్రవారం బహుమతులు అందజేస్తామని తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్రస్వామి, పుష్పలత, పాండురంగం, వీఎస్ఆర్‌కే.ప్రసాద్, చంద్రుడు, రాంచందర్, చంద్రకుమార్‌గౌడ్, మోహన్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

మిడ్జిల్: ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకిరంచాలని ఎంపీపీ సుదర్శన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీఎల్–14 క్రీడలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు 14 ఏళ్లుగా క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఇలాంటి టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో సంతోషమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ గౌస్, వెంకట్‌రెడ్డి, నిస్సార్, భాస్కర్, అశోక్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతి

బాలానగర్: మండలంలోని సూరారం చెందిన కావలి నర్సింహులు (59) గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బాలానగర్: మండలంలోని తిరుమలగిరిలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కేస్లీ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, జగన్ నాయక్, చంద్రప్ప, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇచ్చారు. శిక్షణ గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరి మాట్లాడుతూ బాలికలపై తరచూ ఏదో ఒక ప్రాంతంలో జరుగుతున్న అఘాయిత్యాలను చూసి తల్లిదండ్రు లు బాలికల రక్షణపై దిగులు పడుతున్నారని, ప్రభుత్వం బాలికలకు రక్షణగా కరాటే శిక్షణ ఇవ్వడం కీలకపాత్ర పోషించిందని తెలిపారు. మాస్టర్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలి’

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టనున్న నియామకాల్లో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలని పీయూ ఎంఎస్ఎఫ్ నాయకుడు గణేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు పీయూ గేట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యమంలో మాదిగలు కీలకపాత్ర పోషించారని, ప్రస్తుతం భర్తీ చేయనున్న వీసీ, టీఎస్‌పీఎస్సీ, విద్యామండలి, వివిధ పోటీ పరీక్షల కన్వీనర్‌ల పోస్టుల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నర్సింహ, శ్రీను, కిరణ్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో నీటి సమస్య పరిష్కరించినట్లు మాజీ సర్పంచ్ రాంలాల్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో బోరును వేయించారు. నీటి సమస్య తీర్చేందుకు ఎమ్మెల్యేను అడగ్గానే మంజూరు చేయడంతో పాటు వెంటనే బోరు వేసినట్లు తెలిపారు. డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వెన్నచేడ్ సర్పంచ్ పులిందర్‌రెడ్డి, రహీం, ఫజల్ మైముద్, బాలరాజు, శ్రవణ్, వెంకటయ్య, సమీముల్బల్, మీర్జాబేగ్ పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అడ్డాకుల: మండలంలోని పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం పోలీసులు పట్టుకున్నారు. పొన్నకల్ శివారులోని వాగు నుంచి రెవెన్యూ అధికారుల అనుమతి ద్వారా ఇసుక తరలించడానికి ట్రాక్టర్లు సమయాని కంటే ముందే వాగులోకి వెళ్లి ఇసుకతో వెళ్తుండటంతో కొందరు పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు వాగు వద్దకు వెళ్లి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. దీనిపై విచారించి ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.





మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



కిటకిటలాడుతున్న జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్



పండుగ వచ్చింది.. పల్లె పిలుస్తుంది

సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యా సంస్థలు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కిటకిటలాడింది. ప్రతి రోజు బస్టాండ్ మహాలక్ష్మి పథకంతో రద్దీగా ఉంటుంది. గురువారం ప్రయాణికులతో బస్టాండ్ కిటకిటలాడింది. బస్సులు సకాలంలో లేక పోవడంతో ఎదురు చూపులు తప్పలేదు. పోలీసుల సాయంతో ప్రయాణికులను బస్సులు ఎక్కించాల్సిన పరిస్థితి నెలకొంది.

– సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్





చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ అవసరం



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: మారుతున్న కాలానుగుణాన్ని దృష్టిలో పెట్టుకొని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడానికి చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలకు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరాటే మనిషి జీవన విధానాన్ని మార్పివేయడంతో పాటు మానసికంగా, శారీరకంగా శక్తివంతంగా తయారు చేస్తుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో దృష్టిపెట్టి అన్ని రంగాల్లో ముందుండడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కేజీబీవీ పాఠశాలల్లో డ్రెయినేజీ సమస్యపై విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టి తీసుకురాగా, మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో చేపడుతున్న టీ.డీ, డీపీటీ వ్యాక్సినేషన్ ఎమ్మెల్యే ప్రారంభించారు. 10, 15 ఏళ్ల విద్యార్థులకు ధనుర్వాతం, కంఠసర్పి, కోరింత దగ్గు రాకుండా వ్యాక్సిన్ ఇస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, కేజీబీవీ ఎస్ఓ ప్రశాంతి, సీహెచ్ఓ ఆయూబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్లు వెంకటనర్సమ్మ, ప్రమోద్ కుమార్, నవీన్ గౌడ్, పద్మ, ఎంపీటీసీ పుల్లయ్య, సాయి ఉన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు మరుగుదొడ్ల సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇటీవల బాలికలు పాఠశాలలోనే ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించి వాటిని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. సాధ్యమైనంత తొందరగా మరుగుదొడ్లను నిర్మించే విధంగా చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



పీయూలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రకిరణ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గురువారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ మాట్లాడుతూ యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయనకు దేశంపై ఉన్న అభిమానాన్ని ప్రపంచానికి చాటారన్నారు. కార్యక్రమంలో ప్రవీణ, నాగసుధ, శ్రీధర్ రెడ్డి, అరుంధతిరెడ్డి, అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంవీఎస్‌లో క్విజ్ పోటీలు

జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని క్విజ్ పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, స్వరూప, నాగరాజు, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం చండీహోమం



జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో అమావాస్య పురస్కరించుకుని గురువారం లోకకల్యాణార్థం చండీహోమం చేశారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. హోమం అనంతరం అన్నదానం చేశారు. అమావాస్య పురస్కరించుకుని బాదేపల్లి పాతబజార్ పెద్దగుట్ట ప్రాంగణంలో ఉన్న వీరభద్రుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మీనాంబర పర్వవేదీశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే ఆలకు పరామర్శ



భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, రంగినేని అభిలాష్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శివర్ధన్‌రెడ్డి వారం రోజుల క్రితం మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం అధ్యాపకురాలు సనాజబీన్‌కు మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. ఈమేరకు ఆమె ‘ముస్లిం పొలిటికల్ పార్టీస్ ఇన్ ఇండియా ఏ స్టడీ ఇన్ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఇన్ కేరళ’ అంశంపై మను యూనివర్సిటీ అధ్యాపకుడు మహ్మద్ కుర్షిద్ ఆలమ్ ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఆమెను అభినందించారు.

‘దళితబంధు’ నిధులు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న లబ్ధిదారులు, దళిత సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దళితబంధు నిధులు వెంటనే విడుదల చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా చేపట్టారు. జిల్లాలో దళితబంధు కింద 2,892 మందికి రెండో విడత ప్రభుత్వం మంజూరు చేయగా అధికారులు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిధులు విడుదల కాలేదని తెలిపారు. దళితులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఈ పథకం కింద ఒక్కో యూనిట్‌కు రూ.10 లక్షల చొప్పున విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదన్నారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. జంబులయ్య, యాదయ్య, శ్రీనివాస్, ఆల్లీపూర్ సర్పంచ్ అంజనేయులు, ప్రదీప్, వీరేష్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తిని చాటిచెప్పాలి



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 217వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఇందిర, వడ్డెర సంఘం ప్రతినిధులు యాదయ్య, వెంకటయ్య, ఊశన్న, చంద్రయ్య, సురేష్, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. సమస్యలను ప్రిన్సిపాల్ పద్మావతిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు



విద్యార్థులకు పాఠాలు భోధిస్తున్న విజయ్‌కుమార్

దేవరకద్ర రూరల్: కౌకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డీఈఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో విద్యార్థులు చదువుకు దూరం కావడం వలన భవిష్యత్‌లో విద్యాపరంగా వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిజిటల్, ఐఎఫ్‌సీ ఛానల్ ద్వారా ప్రేరణ తరగతులు బోధించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల సిబ్బంది శాలువాతో మాజీ డీఈఓను సత్కారించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుమన్ మహరాజ్, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా సంక్రాంతి సంబరాలు



న్యూరిషిలో వివిధ రకాల గాలిపటాలతో విద్యార్థులు



దేవరకద్ర మండలంలో..



జడ్చర్లలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

జడ్చర్ల టౌన్: ఐద్వా, వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ 5వ వార్డు ఎర్రగుట్ట వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు కౌన్సిలర్ నవనీత బహుమతులు అందజేశారు.

జడ్చర్ల: 24వ వార్డులోని తాలుకా క్లబ్ ఆవరణలో సంక్రాంతి పండుగ, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.

దేవరకద్ర రూరల్: స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా గురువారం డోకూర్ సమీపంలోని తపోవన్ పాఠశాల, లక్ష్మీపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటిలు నిర్వహించారు. చౌదర్‌పల్లి సమీపంలోని స్విట్స్ కళాశాలలో ముందస్తూ సంక్రాతి సంబురాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రైతుల పండుగ అని, మనం భవిష్యత్‌లో ఏ స్థాయిలో ఉన్న రైతుకు, వ్యవసాయం కాపాడటం కోసం మొదటి ప్రాముఖ్యతను ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు విజేతలకు బహుమతులను అందించారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేశారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని శ్రీప్రతిభ పాఠశాలలో గురువారం రంగోలి పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులతో అభినందించింది.



నారధుడి వేషధారణలో విద్యార్థి

న్యూరిషిలో గాలిపటాలు, ముగ్గుల సంబరాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని బాయమ్మతోటలో గల న్యూరిషి కాన్సెప్ట్‌స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురకు కైట్స్ పోటీలు, బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ రూపాల్లో విద్యార్థినీలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నారు. కామిక్స్ చిత్రాలతో కూడిన గాలిపటాలతో బాలురు సందడి చేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు శిరీష, పూజిత, చంద్రకళ, సుశాంత్‌కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామకృష్ణ, పాఠశాల సిబ్బంది నగిత, విజయ్, సుజాత, శాంతికుమార్, శోభ, రజిని, లక్ష్మి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

జడ్చర్ల: మండలంలోని పెద్ద ఆదిరాల జెడ్పీహెచ్ఎస్‌ను అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. మంజూరైన బడ్జెట్, ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి డిజిటల్ తరగతుల నిర్వహణపై విచారించారు. మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లయ్య, ఈఈ భాస్కర్, ఏఈ నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో టీఎన్‌జీఓ పట్టణ కమిటీకి చెందిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా ఏఐఎస్‌జీఈఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమ్మె నిర్వహిస్తున్నట్లు, రాష్ట్రంలో టీఎన్‌జీఓ సమ్మెకు నాయకత్వం వహిస్తున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక క్యాలెండర్‌ను గురువారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ నాయకులు ఎస్.కురుమూర్తి, కిల్లె గోపాల్ ఆవిష్కరించారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డీటీఎఫ్ సంఘం క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. గాజులపేట ఉన్నత పాఠశాలలో తపస్ క్యాలెండర్ మండల నోడల్ అధికారి మహ్మద్‌ఖాజా ఆవిష్కరించారు.

మిడ్జిల్: టీపీయూఎస్ క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో కాంప్లెక్స్ హెచ్ఎం సరస్వతీ ఆవిష్కరించారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించండి

నవాబుపేట: డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎన్మంగండ్లలో నిర్మించిన 48 ఇళ్లను తమకు కేటాయించాలని ఎన్మంగండ్ల, రుక్కంపల్లి, సీతమ్మతండాలకు చెందిన పలువురు కోరారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో లబ్దిదారుల ఎంపిక కాలేదన్నారు. కార్యక్రమంలో రాములు, వెంకటయ్య, సుజాత, మంజుల తదితరులు ఉన్నారు.